సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



పార్శిల్ శవం.. తేలని నిజం
ఉండి మండలం యండగండికి చెందిన ఓ మహిళ ఇంటికి పార్శిల్‌లో వచ్చిన మృతదేహం గుర్తింపులో పోలీసులు తలమునకలయ్యారు. 8లో



చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్
జిల్లాలో చైన్ స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ అద్నాం నయీం అస్మి తెలిపారు. 8లో



పశువధపై పోరాటం
తణుకు మండలం తేతలిలోని ఓ కర్మాగారంలో పశువధను ఆపేంత వరకూ తమ పోరాటం కొనసాగుతుందని రామరాజ్యం వ్యవస్థాపకుడు అన్నారు. 8లో

న్యూస్‌రీల్

పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు నియామకపత్రం అందిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో 20 మంది నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జిల్లా ప్రాజెక్టు కమిటీకి అధ్యక్షుడిగా కునాధరాజు మురళీ కృష్ణంరాజును, ఉపాధ్యక్షుడిగా గుబ్బల మల్రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. అనంతరం వీరికి నియామక పత్రాలు అందించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎంపీ తోట సీతామహాలక్ష్మి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం అవకతవకలను ఉపేక్షించం
కలెక్టర్ నాగరాణి



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం అర్బన్: పీడీఎస్ బియ్యం అవతవకలను ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. నరసింహపురంలోని శ్రీ రాధాకృష్ణ రైస్ మిల్, లక్ష్మీ కృష్ణ రైస్ ట్రేడర్స్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. రైసుమిల్లును, మిల్లులోని సీఎంఆర్ బియ్యం నిల్వలను పరిశీలించారు. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నిబంధనలు సడలించిందని, దీనికి అనుగుణంగా మిల్లర్లు సహకరించి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకూడదన్నారు. నిబద్ధతగా వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. డీఎస్‌ఓ ఎన్.సరోజ, ఏఎస్‌ఓ ఎంవీ రవిశంకర్, సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు
భీమవరం (ప్రకాశంచౌక్): పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. శనివారం భీమవరం హౌసింగ్ బోర్డులోని చిల్డ్రన్ అండ్ వాకింగ్ పార్కు, ఆదిత్య కళావేదిక పార్కును ఆమె సందర్శించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సమర్థంగా పనిచేయాలి
భీమవరం (ప్రకాశంచౌక్): కస్టోడియన్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, కో-ఆపరేటివ్ శాఖ అధికారులు, సీఎస్ డీటీలు, ఆర్‌ఎస్‌కే సిబ్బందితో ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు వచ్చిన ధాన్యం లోడులు వెంటనే దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చట్టాలపై నైపుణ్యం పెంచుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్

ఏలూరు (టూటౌన్): మారుతున్న చట్టాలపై న్యాయమూర్తులు అవగాహన పెంచుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ పిలుపునిచ్చారు. ఏలూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులకు ఒక రోజు శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పురుషోత్తంకుమార్ మాట్లాడుతూ శిక్షణా తరగతిలో ఫ్రేమింగ్ ఆఫ్ చార్జెస్, సెక్షన్ 311, 313, 319 సీఆర్‌పీసీ, బాధితులు-పరిహారం మొదలైన చట్టాలపైన అవగాహన కల్పించామన్నారు. రిసోర్స్ పర్సన్‌లుగా వైవీ రామకృష్ణ, జీవీ కృష్ణయ్య, ఏపీ సురేష్, ఎం.సునీల్‌కుమార్ వ్యవహరించారు. న్యాయమూర్తులు పాల్గొన్నారు.



కాళ్ల: పెద అమిరంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త పీవీఎల్ నరసింహరాజు



తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



పాలకొల్లు అర్బన్: చీరలు అందిస్తున్న సమన్వయకర్త గుడాల గోపి

సంక్షేమ సారథీ.. వర్ధిల్లు వెయ్యేళ్లు

జననేతకు నీరా'జనం'
- పండుగలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు
- సేవా కార్యక్రమాలతో అభిమానం చాటిన పార్టీ శ్రేణులు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పలుచోట్ల రక్తదాన శిబిరాలు
- పేదలకు దుప్పట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు

జనాభిమానం ఉప్పొంగింది. సేవా సంబరం అంబరాన్నంటింది.. అభివృద్ధి వారధి.. సంక్షేమ సారథికి ఊరూవాడా నీరా'జనాలు' అర్పించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు జిల్లావ్యాప్తంగా పండుగలా జరిగాయి. పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద కేక్‌లు కట్‌చేసి స్వీట్లు పంచారు. పేదలకు దుప్పట్లు, దుస్తులు, ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల పలువురు నాయకులు మాట్లాడుతూ జగన్ పాలన స్వర్ణయుగాన్ని తలపించిందన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, పేద ప్రజల అభ్యున్నతికి అమలుచేసిన సంక్షేమ పథకాల దేశంలోని ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. ఆరునెలలకే కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందన్నారు. సూపర్ సిక్స్ అంటూ గద్దెనెక్కాక ఒక్క పథకం అమలుచేయకుండా సూపర్‌గా మోసం చేసిన తీరుపై ఎక్కడికక్కడ జనం మండిపడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో చేకూరిన సంక్షేమ లబ్ధిని ప్రజలు గుర్తు చేసుకుని మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ.. వెయ్యేళ్లు వర్ధిల్లు.. నూరేళ్లు జీవించు.. అని దీవించారు.

- తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వేడుకలు ఘనంగా జరిగాయి. మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. రాష్ట్ర రైతు వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. పడాల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. పెంటపాడులో మహిళలు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.
- భీమవరం ప్రభుత్వాస్పత్రి ఆవరణలో పార్టీ నేతలు కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు తదితరులు పాల్గొన్నారు. పార్టీ నేత రాయప్రోలు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో పేదలకు చీరల పంపిణీ చేశారు. వీరవాసరం మండలం నవుడూరులో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. వీరవాసరంలో చెల్లెం ఆనందప్రకాష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భీమవరం మండలం పెదగరువులో ఎంపీపీ పేరిచర్ల నర్సింహరాజు ఆధ్వర్యంలో వంద మందికి పైగా మహిళలకు చీరల పంపిణీ చేశారు. నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, మేడిది జాన్సన్, చినమిల్లి వెంకట్రాయుడు తదితరులు పాల్గొన్నారు.
- కాళ్ల మండలం పెద అమిరంలోని పార్టీ కార్యాలయం వద్ద ఉండి నియోజకవర్గ సమన్వయకర్త పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో కేక కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆకివీడులోని వైఎస్సార్ సెంటర్, కుప్పనపూడి, సిద్ధాపురం గ్రామాల్లో మండలాధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య ఆధ్వర్యంలో వేడుకలను జరిగాయి. వైఎస్సార్ సెంటర్‌లో వంద మంది పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.
- పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. విశ్వమానవ వేదిక, రాహుల్ వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు పండ్లు, చీరలు, దుప్పట్లు అందజేశారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నేత గుణ్ణం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.
- నరసాపురంలోని పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ మండల యూత్ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న పాల్గొన్నారు.
- తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో వేడుకలు జరిగాయి. పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.
- ఆచంటలో పార్టీ నాయకుడు సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పెనుగొండ, ఆచంట, పోడూరు మండలాల్లోని గ్రామాల్లో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



భీమవరం అర్బన్: పెదగరువులో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పార్టీ నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల, మేడిది జాన్సన్



నరసాపురం: పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు అందిస్తున్న నాయకులు

కువైట్‌లో ఘనంగా వేడుకలు



కువైట్‌లో మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ప్రవాసాంధ్రులు

నరసాపురం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కువైట్‌లో నరసాపురానికి చెందిన ప్రవాసాంధ్రులు ఘనంగా నిర్వహించారు. కువైట్ హవల్లీలోని ఆర్‌ఆర్ స్పైసీ పేరుతో నడుస్తున్న ఇండియా రెస్టారెంట్‌లో వేడుకలు జరిగాయి. నరసాపురానికి చెందిన ఈదా రాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు వ్యాపారవేత్త, కువైట్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా ప్రజా సంక్షేమం పట్టించుకోకుండా మంత్రి లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈదా రాజు మాట్లాడుతూ కువైట్‌లోని ప్రవాసాంధ్రులు రోజూ జగన్ పాలనను గుర్తుచేసుకుంటున్నారని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్‌ను గెలిపించుకుంటామని ఆంధ్రప్రదేశ్ ప్రజలు డిసైడ్ అయ్యారన్నారు. ప్రవాసాంధ్రులు వి.నరసారెడ్డి, నాయని మహేశ్వరరెడ్డి, గోవింద్ నాగరాజు, కావేటి రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తణుకు అర్బన్: పార్టీ కార్యాయలంలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



పెనుగొండ: ఆచంట ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు అందిస్తున్న నాయకులు

అలుపెరుగని యోధుడు జగన్



ఏలూరులో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీలు వంకా, కవురు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి, జెడ్పీటీసీలు, నాయకులు

ఏలూరు టౌన్: రాష్ట్ర రాజకీయాల్లో ధీరుడుగా, అలుపెరుగని పోరాట యోధుడిలా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా ఉన్నారని ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులో జెడ్పీ సమావేశానికి హాజరైన అనంతరం వారంతా ఇండోర్‌స్టేడియం గేట్ సమీపంలో జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, జెడ్పీటీసీలతో కలిసి ఎమ్మెల్సీలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసి చూపించిన ఏకైక నాయకుడు జగన్ మాత్రమే అని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందన్నారు. సూపర్-6 అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలను దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. భవిష్యత్తు అంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్లు పెనుమాల విజయబాబు, పోతిన శ్రీలేఖ, జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, నిట్టా లీలానవకాంతం, తుమ్మగుంట భవానీ, కే.వెంకట కాశీ విశ్వనాథ్, కె.జయలక్ష్మి, దేవరపు సోమలక్ష్మి, మొడియం రామతులసీ, ఎం.వసంతరావు, ఎస్.బాలసూర్యనారాయణరాజు, ఎం. నీరజ, హరనాథ్‌రాజు, రమేష్, నాగేశ్వరరావు, రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

వాడీవేడి.. ఫిరాయింపుపై మండిపడి

- జెడ్పీ చైర్‌పర్సన్‌ను నిలదీసిన జెడ్పీటీసీలు
- ఉమ్మడి జిల్లాపరిషత్ ప్రత్యేక సమావేశం
- అవిశ్వాస తీర్మానం నోటీసు చెల్లదన్న సీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. పార్టీ మారాల్సిన అవసరం ఏముందంటూ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ తరపున ఆమె గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీలో చేరడంపై ఇప్పటికే 30 మందికి పైగా జెడ్పీటీసీలు అవిశ్వాస తీర్మానం కోరుతూ సీఈఓకు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శనివారం ఏలూరు జెడ్పీ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి సీఈఓ ఆర్.విజయరాజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 38 మంది జెడ్పీటీసీలు హాజరు కాగా 36 మంది వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలే ఉన్నారు. ఒకరు టీడీపీ, మరొకరు జనసేన జెడ్పీటీసీలు హాజరయ్యారు.

మహిళలకు జగన్ పెద్దపీట

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత ప్రభుత్వ హయాంలో మహిళలకు పెద్దపీట వేస్తూ పద్మశ్రీని జిల్లాపరిషత్ పీఠంపై కూర్చోబెట్టారని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు అన్నారు. పార్టీకి నమ్మక ద్రోహం చేయడం తగదన్నారు.

సీఈఓని నిలదీసి..

సింగిల్ అజెండాగా పొందుపర్చిన అవిశ్వాస తీర్మానం నోటీసుపై సభ ప్రారంభంలోనే జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఫ్లోర్‌లీడర్, జెడ్పీటీసీలు పెద్దిరాజు, గోవిందరాజులు నిలదీశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల్లో నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టడం కుదరదని జెడ్పీ సీఈఓ చెప్పారు. ఈ కారణంగా అవిశ్వాస తీర్మానం నోటీసు వీగిపోయినట్లేనని సమాధానమిచ్చారు. సమావేశం మినిట్స్‌లో ప్రతిదీ పొందుపరచి, దాని నకలు కాపీని తమకు అందించాలని జెడ్పీటీసీలు కోరగా.. ప్రతిదీ మినిట్స్ బుక్‌లో పొందుపరుస్తామని, సదరు కాపీని పంచాయతీరాజ్ కమిషనర్‌తో పాటు సభ్యులకు అందజేస్తామని సీఈఓ స్పష్టం చేశారు.

40 మంది జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీలోనే..
పెనుమాల విజయ్‌బాబు, జెడ్పీ వైస్ చైర్మన్



ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా, ఆశలు చూపినా, బెదిరింపులకు పాల్పడినా ఇప్పటికీ 40 మంది జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు అన్నారు. మొత్తం 48 మంది సభ్యుల్లో ఒక స్థానం ఖాళీగా ఉందని, మిగిలిన 47 మందిలో 45 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు ఉన్నారన్నారు. ఇందులో ఐదుగురు సభ్యులు కూటమి వైపు వెళ్లినా.. 40 మంది వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామన్నారు. ప్రత్యేక సమావేశానికి 36 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు హాజరుకాగా నలుగురు వివిధ కారణాలతో రాలేదన్నారు. అందరూ ఏకాభిప్రాయంతోనే ఉన్నామన్నారు.

పదవినీ వదిలేయాలి



చింతలపూడి నీరజ, జెడ్పీటీసీ

మహిళగా ఘంటా పద్మశ్రీకి జగన్ అత్యున్నత స్థానం కల్పించారని చింతలపూడి జెడ్పీటీసీ చింతలపూడి నీరజ అన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉంటే ప్రజలకు సేవ చేయలేం, నిధులు తీసుకురాలేమన్నది దురభిప్రాయమన్నారు. పార్టీ మారడం జెడ్పీ చైర్‌పర్సన్ విజ్ఞతకే వదిలేశామని, ఆమె పార్టీ ఫిరాయించడం బాధాకరమన్నారు. పార్టీ అక్కరలేనప్పుడు దాని ద్వారా వచ్చిన పదవిని కూడా ఆమె వదిలేయాలని అన్నారు.

క్లుప్తంగా

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఉండి: అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్తింటివారు వేధింపులకు గురి చేస్తున్నారని మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారానికి చెందిన ఇళ్ళ ధనలక్ష్మికి పెరవలికి చెందిన సత్యనారాయణతో 2011లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నంగా ఇచ్చారు. వ్యసనాలకు బానిసైన సత్యనారాయణ మరో రెండు లక్షలు అదనంగా కట్నం కావాలని వేధింపులకు గురి చేసేవారు. వేధింపులకు అత్తింటివారు మద్దతుగా నిలిచారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం



తణుకు రైల్వే ట్రాక్ ప్రాంతంలో మృతదేహం

తణుకు అర్బన్: తణుకు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం ప్రాంతంలోని రైల్వే ట్రాక్ వద్ద సుమారు 70 ఏళ్ల వయసున్న వృద్ధురాలి మృతదేహం శనివారం ఉదయం లభ్యమైంది. రైలు నుంచి పడిపోయింది, రైలు ఢీకొట్టి మృతిచెందిందా అనే విషయం తేలాల్సి ఉంది. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. గత రెండు రోజులుగా తణుకు రైల్వేస్టేషన్ రోడ్డులో మతిస్థిమితం సరిగా లేక ఆ వృద్ధురాలు తిరుగుతున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తణుకు అర్బన్: జాతీయ రహదారి డీమార్ట్ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అన్నవరప్పాడు గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి అడ్డగర్ల సుబ్రహ్మణ్యం (45) కూరగాయల కొనుగోలుకు తణుకు కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌కు వస్తుండగా తాడేపల్లిగూడెం వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి శరీరం గుర్తుపట్ట లేకుండా నుజ్జునుజ్జుగా మారిపోవడం కలిచివేసింది.

పార్శిల్ శవం.. తేలని నిజం

ఉండి: ఉండి మండలం యండగండికి చెందిన తులసి అనే మహిళ ఇంటికి పార్శిల్‌లో వచ్చిన మృతదేహం గుర్తింపులో పోలీసులు తలమునకలయ్యారు. ఆ శవం ఎవరిది? ఎవరు పంపారు.. యండగండిలో తులసి ఇంటికి ఆ బాక్స్‌ను ఎందుకు పంపారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు నాలుగు బృందాలు పనిచేస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ఈ కేసు ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఆ విషయాన్ని మాత్రం పోలీసులు ఇంకా ధృవీకరించడం లేదు. గురువారం సాయంత్రం ఓ కారులో చెక్కపెట్టెతో పాటు ఒక మహిళను సమీప గ్రామమైన ఉణుదుర్రు పరిధిలో రోడ్డుపై దింపినట్లు సమాచారం. అక్కడ నుంచి ఆ మహిళ రోడ్డుపై వెళ్లే ఆటోను మాట్లాడి యండగండి రాయపేటలోని ముదునూరి రంగరాజు ఇంటికి పార్శిల్‌ను చేర్పించింది. ఆ మహిళ ఎవరు? ఆమెను, శవంతో ఉన్న చెక్కపెట్టెను కారులో దించింది ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తండ్రికి ఉన్న సుమారు మూడున్నర ఎకరాల పొలం కోసం అక్కాచెల్లెళ్ళ మధ్య గొడవలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

ఆస్తి కోసం అక్కాచెల్లెళ్ల గొడవలపై పోలీసుల దృష్టి

అనుమానితుడి ఫోన్ సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు

చిన్న కుమార్తె భర్తగా చెబుతున్న వ్యక్తిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం నుంచి అతని ఆచూకీ లేకపోవడంతో అతనిపై నిఘా ఉంచారు. చిన్న కుమార్తె భర్త స్వస్థలం మొగల్తూరు అని చెప్పగా.. పోలీసుల విచారణలో మాత్రం అతని స్వగ్రామం కాళ్ళ మండలం ఇస్కోలులంక అని తెలిసింది. తనకు వివాహం కాలేదని చెప్పి రంగరాజు చిన్నకుమార్తెతో సహజీవనం చేస్తున్నట్లు తెలిసింది. అతనికి అంతకముందే వివాహమైనట్లు పోలీసుల పరిశీలనలో తేలింది. అతని ఆచూకీ లభించకపోవడంతో అతని తల్లిదండ్రులను దర్యాప్తు కోసం పిలిపించినట్లు సమాచారం. అనుమానితుడి ఫోన్ కాల్ చివరి సిగ్నల్ తెలంగాణా రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉండటంతో పోలీసులు అటువైపు దృష్టి సారించారు. శనివారానికి అనుమానితుడి సిగ్నల్ సమీపంలోని జిల్లాలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక చెక్కపెట్టెలో పార్శిల్‌గా వచ్చిన మృతదేహానికి సంబంధించి ఎలాంటి ఆచూకీ లభించలేదు. 32 నుంచి 35 ఏళ్ల వయసున్న వ్యక్తిని సుమారు 3 రోజుల క్రితం ప్లాస్టిక్ తాడుతో ఉరివేసి చంపినట్లు తెలుస్తుంది. మూడు రోజుల క్రితమే శవాన్ని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పార్శిల్ చేసినట్లు అనుమానిస్తున్నారు.

మొక్కుబడిగా జెడ్పీ సమావేశం

- 17 మంది జెడ్పీటీసీలు మాత్రమే హాజరు
- 30 మంది వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు బాయ్‌కాట్

ఏలూరు (టూటౌన్): శనివారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశానికి.. 47 మంది జెడ్పీటీసీలు హాజరు కావాల్సి ఉండగా కేవలం 8 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఎలాగైనా సర్వసభ్య సమావేశం నిర్వహించి తీరాలనే కూటమి నాయకుల పట్టుతో చివరకు 17 మంది జెడ్పీటీసీలు సమావేశానికి హాజరయ్యారు. ఇందులో ముగ్గురు సభ్యులు సంతకాలు చేసి బయటకు వెళ్లిపోయారు. 30 మంది వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు బాయ్‌కాట్ చేశారు. కేవలం 14 మందితోనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కొనసాగించారు. 42 అంశాలపై చర్చించాల్సి ఉండగా.. కేవలం ఐదారు అంశాలపైనే చర్చ జరిగింది. జిల్లా కలెక్టర్ సైతం మొక్కుబడిగా వచ్చారు. కనీసం ఒక్క ఎంపీపీ కూడా హాజరు కాలేదు. ఇదీ శనివారం ఏలూరు జెడ్పీ సమావేశ మందిరంలో సర్వ సభ్య సమావేశం జరిగిన తీరు. సమావేశానికి అధ్యక్షత వహించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యా ప్రమాణాల స్థాయి పెంపుదలకు విద్య శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు గత ఏడాది అందించిన విధంగానే విజయకేతనం సిలబస్ పుస్తకాలను అందించనున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సమావేశంలో జెడ్పీటీసీలు తెలిపిన సమస్యలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కుదింపు కారణంగా ఉన్న వారిపై అదనపు భారం పడిందన్నారు. విద్యార్థుల నమోదుకు ఉద్దేశించిన ఆపార్ మంచిదే కానీ వివరాల నమోదులో జరిగే పొరబాట్లకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయకుండా చూడాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు. ఇన్‌చార్జి సీఈఓ ఆర్.వి జయరాజు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్నం 2.30 గంటలకు ఖాళీగా కన్పిస్తున్న జెడ్పీ సమావేశ మందిరం

నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. పాలకొల్లు ఏరియా ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుంచె మురళి వెంకట తులసీదర్‌ను ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, చెక్కుల ఫోర్జరీ కేసులో అరెస్టు చేసినట్లు తెలిపారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓ.రవికుమార్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి సుమారు రూ.62 లక్షల వరకు నిధులను దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తులో తేల్చారు.



ఫోర్జరీ కేసులో అరెస్టయిన కుంచె మురళి తులసీదర్

పశువధ ఆపేంత వరకూ పోరాటం

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి పంచాయితీ పరిధిలోని సత్యవాడ రోడ్డులో చట్ట విరుద్ధంగా నిర్వహిస్తున్న పశు వధకు జిల్లా కలెక్టర్ బాధ్యులని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రామరాజ్యం వ్యవస్థాపకుడు కొవ్వూరి వీరరాఘవరెడ్డి తెలిపారు. తణుకు ఆర్యవైశ్య భవనంలో తణుకు గోసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువధ నిర్వహిస్తున్న కర్మాగారానికి అనుమతులు లేవనే విషయం అధికారులకు తెలుసని, తణుకు తహసీల్దారు నుంచి కలెక్టరు వరకు ఫిర్యాదులు చేసినా.. కర్మాగారంలో పాడి పశువులను అత్యంత క్రూరంగా హింసించి చంపుతున్న వైనాన్ని అధికారులే ప్రోత్సహిస్తున్నారన్నారు. అధికారులు ప్రజా సేవకులని.. వారి బాధ్యతలు నిర్వర్తించని క్రమంలో సామాన్యుడు వారిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించే పరిస్థితి నూతన చట్టం ప్రకారం ఉందన్నారు. తమ కర్మాగారానికి ఎన్‌ఓసీ ఇప్పించమని నిర్వాహకులు గత నెలలో పంచాయితీకి దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇవ్వలేదని అయితే అనుమతులు లేకుండానే పశువధ నడుస్తున్నట్లుగా కాదా? అని నిలదీశారు. పశు వధ ఆపేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. రాజేష్‌నాథ్ అఘోరా మాట్లాడుతూ పశు వధ నుంచి తణుకు ప్రాంతాన్ని కాపాడుకోవడానికి రానున్న రోజుల్లో తణుకు ప్రాంతానికి అఘోరాలు రానున్నారని, ప్రజలు కూడా కలిసిరావాలని అన్నారు. కార్యక్రమంలో గోసేవా సమితి సభ్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్, సత్తిరాజు వెంకట సుబ్రహ్మణ్యం, జల్లూరి జగదీష్, చవ్వా శ్రీనివాసరాజు, వి.వెంకట రమ, బొద్దాని శ్రీనివాస్, పసుపులేటి సూరిపండు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరరాఘవరెడ్డి, రాజేష్‌నాథ్ అఘోరి

బైక్‌ల చోరీ ముఠా అరెస్టు

వీరవాసరం: జిల్లాలో చైన్ స్నాచింగ్స్, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ నయిం అస్మి శనివారం వీరవాసరంలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. పోడూరుకు చెందిన కాలా రమేష్ బాబు, కడలి బాబి పలు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడ్డారని.. వారి నుంచి బంగారం, 27 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చైన్ స్నాచింగ్స్, బైక్ చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. వీరిపై పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, వీరవాసరం, పాలకోడేరు, భీమవరం పోలీసు స్టేషనల్లో 30 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ ఆర్.జి జయసూర్య, భీమవరం రురల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్ , వీరవాసరం ఎస్ఐ ఎం.రాజ్ కుమార్,వీరవాసరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రికవరీ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

ఖోఖో పోటీలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల క్రీడా ప్రాంగణంలో నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలకు అంతర్ కళాశాలల ఖో–ఖో పోటీలు, విశ్వవిద్యాలయం జట్టు సెలక్షన్స్ శనివారం నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన సీఆర్ రెడ్డి విద్యాసంస్థల పాలక మండలి కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు వెలికి తీసేందుకు నన్నయ విశ్వవిద్యాలయంతో కలసి ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే 13 కళాశాలల జట్లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఆర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు అధ్యక్షత వహించారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: గంజాయి కలిగి ఉన్న నేరంపై ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని పెదతాడేపల్లి ఇరిగేషన్ పుంత వద్ద అనుమానంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద 270 గ్రాముల గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. నిందితులు గణేష్‌నగర్‌కు చెందిన చించిలి హర్షవర్ధన్, మరొకరిని మైనర్‌గా గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు.

కేసు నమోదు

భీమవరం (ప్రకాశంచౌక్): పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. భీమవరం మండలం రాయలం పంచాయతీకి సంబంధించి నిధులను వీరు స్వాహా చేశారు.

క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం


పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ఇంటి వద్దనే అందించారని గుర్తు చేశారు. తిరిగి మరలా జగన్ పాలన కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. అలాగే, తాడేపల్లిగూడెం పట్టణంలోని కొండయ్య చెరువు వద్ద గల లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్స్ హోమ్ చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కర్రి భాస్కరరావు, నాయకులు కొలుకులూరి ధర్మరాజు, చిటకన ప్రసాద్, మానికొండ వెంకటేశ్వరరావు, బండారు నాగు, కొట్టు నాగేంద్ర, గార్లపాటి వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అందించిన సేవలతోనే గుర్తింపు


ఫార్మాసిస్ట్ రామారావును సత్కరిస్తున్న డీఎంహెచ్‌వో ఉమామహేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: విధి నిర్వహణలో అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలో పనిచేస్తూ తణుకు బదిలీపై వెళ్లిన ఫార్మాసిస్ట్ రామారావుకు సన్మాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని అన్నారు. అనంతరం దాతలు పసుమర్తి రామ్, లక్ష్మణ్‌లను ఆయన సన్మానించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూపాదేవి, సీనియర్ అసిస్టెంట్ చీకట్ల శివాజీ గణేష్, పంతం నాగేశ్వరరావు, మాధవరం సీనియర్ అసిస్టెంట్ కిషోర్, సీహెచ్‌వో కే.సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతిర్మయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం స్థానిక సత్యవతి నగర్‌లోని విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠంలో శనివారం నిర్వహించారు. యోగ మాస్టారు కరిబండి రామకృష్ణచే అగ్నిహోత్ర కార్యక్రమం, ధ్యానం జరిగాయి. కైండ్‌నెస్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరా ఫౌండేషన్ సౌజన్యంతో వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ, ఆదిత్య కళాశాలలో విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ నేర్పించారు. కైండ్‌నెస్ లయన్స్‌క్లబ్ యోగా సభ్యులు గట్టిం ప్రవీణ్‌కృష్ణ, పిల్ల వెంకన్నబాబు, యోగ సాధకులు, డాక్టర్ కంచర్ల లక్ష్మీనరసింహ, పతంజలి యోగాలయం యోగా గురువు ఇంజామూరి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

నన్నయ్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె.నిత్యానందన్‌కు నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. శనివారం డాక్టరేట్‌ను ప్రిన్సిపాల్ టి.అశోక్ ఆయనకు అందజేశారు. కేన్సర్ యాంటి ఇన్ఫెక్టివ్ ఫార్మాస్యూటికల్‌పై నిత్యానందన్ పరిశోధన చేశారు. కేన్సర్ నివారణకు వినియోగించే మందుల భద్రత, సమర్థత, స్థిరత్వం అనే పద్ధతులపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా నిత్యానందన్‌ను పలువురు అభినందించారు.

అమ్మలాంటి కమ్మనైనది మాతృభాష

తణుకు అర్బన్: అమ్మలాంటి కమ్మని మాతృభాష విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచుతుందని, అటువంటి మాతృభాషపట్ల మమకారం పెంచే ఉద్దేశంతో మాతృభాష పరిరక్షణ సేవాసమితి చేస్తున్న కార్యక్రమాలు శుభపరిణామమని డీవైఈవో మురళి సత్యనారాయణ అన్నారు. తణుకులో మాతృభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో శనివారం సమితి వ్యవస్థాపకులు నాగభూషణం అధ్యక్షతన నిర్వహించిన శతక పద్య సహస్ర గళార్చన వేమన శతకం కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మలాంటి మాతృభాష గొప్పతనం ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు. తణుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి 60కిపైగా పాఠశాలలల నుంచి 5వేల మంది విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమంలో సమితి ఆధ్వర్యంలో చిన్నారులు తెలుగుతల్లి, భరతమాత వేషధారణలో అలరించారు. అనంతరం ప్రసిద్ధి చెందిన 108 పద్యాలను చిన్నారులు రాగయుక్తంగా ఆలపించిన తీరు ఆహుతులను అలరించింది. లక్షగళార్చనలో భాగంగా 10 సార్లు జనగణమన గీతాలాపన చేశారు.


పెంటపాడు: కోనేరు చెరువు వద్ద కేక్ కట్ చేస్తున్న రెడ్డి సూరిబాబు, కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు


తణుకు అర్బన్: తేతలిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


ఇరగవరం: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


అత్తిలి: వైఎస్సార్ సీపీ కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

సంక్షేమ సారథి వైఎస్ జగన్

- రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- వాడవాడలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్ : పేదల ఆశాజ్యోతి, వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి పుట్టినరోజు వేడుకలు కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టినరోజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగన్‌మోహనరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ పక్షపాతం లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పాలన అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఎన్నికల హామీలను నూటికి నూరుశాతం అమలు చేసిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో అమలు చేయలేని వాగ్దానాలిచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. 7 నెలలో రూ.87వేల కోట్లు అప్పు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలేని కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. వాటినే పచ్చపత్రికలు ఘనమైన ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మోసాలను గుర్తించిన ప్రజలు రానున్న రోజుల్లో వైఎస్ జగన్‌మోహనరెడ్డికి తిరిగి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ సూర్పని రామకృష్ణ, చిటికన ప్రసాద్, కొలుకులూరి ధర్మరాజు, షేక్ నౌషద్ మాట్లాడుతూ బెల్టుషాపులు, పేకాట క్లబ్‌లు కోడిపందాలు నిర్వహిస్తూ కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతుందని విమర్శించారు. ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ప్రజలు త్వరలోనే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పి మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు వైఎస్ జగన్‌కు పట్టం కడతారని ఆకాంక్షించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, వృద్ధాశ్రమంలో, అనాధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, బండారు నాగు, చెన్నా జెనార్ధన్, పొట్ల ఏడుకొండలు, కట్టా రంగబాబు, కైగాల శ్రీనివాస్, పత్సమట్ల సావిత్రి, మస్తాన్‌బీబీ, దేవాబత్తుల నాగమణి, మానికొండ వెంకటేశ్వరరావు, గుండుమోగుల సాంబయ్య, చామన సూర్యచంద్రరావు, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం అర్బన్: కేక్ కట్ చేసి కార్యకర్తలకు అందిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


తాడేపల్లిగూడెం రూరల్: వడ్డి రఘురామ్ నాయుడు నివాసం వద్ద జననేత జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు నివాసం వద్ద కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా రఘురామ్ నాయుడు మాట్లాడుతూ పేదల పెన్నిధి వైఎస్ జగన్‌కు భగవంతుని కృప కటాక్షాలు ఎల్లవేళాల ఉండాలని ప్రార్థించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడబోతున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, మాజీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, ఎంపీటీసీ మర్లపూడి సుబ్బారావు, దారపురెడ్డి శ్రీనివాస్, మాకరాజు సతీస్, కందుబోయిన కృపావరం తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో పలు చోట్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

మారంపల్లిలో...

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మారంపల్లిలో పార్టీ నాయకుడు ఇందుకూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచారు. ఆరుగొలను గ్రామంలో సబ్బితి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేయగా, కొండ్రుప్రోలులో పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు.

అధినేతకు శుభాకాంక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు శనివారం తాడేపల్లిలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు పార్టీ శ్రేణులు, మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

అత్తిలిలో..

అత్తిలి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం అత్తిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన అంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే అని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, నాయకులు రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, గారపాటి నాగరాజు, సబ్బితిరాజేష్, కంకటాల సతీష్, రాయుడు ధర్మారావు, తానుకొండ దావీదు, బుడితి సుజన్ కుమార్, మద్దాల బాపిరాజు, ఇల్లూరి సంపదరావు, వూడిమూడి ప్రసాద్, పోలినాటి చంద్రరావు, గరిన్నపూడి సర్వేశ్వరరావు, పంపన బుజ్జి, కొల్లిచిన్ని, బొండాడ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తణుకులో..

తణుకు అర్బన్: మేనిఫెస్టో అమలే పరమావధిగా పాలన సాగించిన ఏకైక నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా తణుకు పార్టీ కార్యాలయంలో కేకు కట్‌చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు ఉండవల్లి జానకి, నత్తా కృష్ణవేణి, పార్టీ ప్రచార కమిటీ కార్యదర్శి పెన్మెత్స రామరాజు, మారిశెట్టి శేషగిరి, డీజే అమూల్యారావు, ఎస్‌వీ జాకబ్‌బాబు, బొల్లా దుర్గాప్రసాద్, పుల్లెపు సూర్యచంద్రరావు, చింతన్న, షేక్ జిలానీ, వన్నెంరెడ్డి మురళి, గారపాటి సత్యనారాయణ, రంభ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తేతలి గ్రామంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా తేతలి గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని 200 మంది వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, పేరిచర్ల సతీష్‌రాజు, సరెళ్ల వీరతాత, దారం శ్రీను, గారపాటి బాబూరావు, నక్కా ధనరాజు మానేపల్లి సంపతరావు, దొంగ భీమ చంద్రరావు, వలవల కిషోర్ తదిరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో.

ఇరగవరం: మండలంలోని 21 గ్రామాలలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్‌లు, సేవా కార్యక్రమాలు జరిగాయి. ఇరగవరంలో గ్రామ అధ్యక్షుడు వీరవల్లి యుగంధర్, సర్పంచ్ కె.శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు పాల పాలేశ్వరరావు, చవ్వాకుల శ్రీనివాస్, మామిడిశెట్టి శ్రీనివాస్, కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, పెనుమత్స సుబ్బరాజు, వెంకట రెడ్డి, గణపతి, కూడిపూడి నాగ సత్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న పాలన చరిత్రలో సువర్ణాధ్యాయం

పెంటపాడు: జగనన్న ప్రజారంజక పాలన చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలుస్తుందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు వడ్డి రఘురాం పేర్కొన్నారు. మండలంలో పలు గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పెంటపాడులోని కళాశాల సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లమిల్లి విజయానంద రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రఘురాం పాల్గొని కేక్‌లు కట్ చేసి, పేదలకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలని నవరత్నాలతో పాటు, పలు పథకాలు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి మళ్లీ సీఎంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గూడెం ఎంపీపీ శేషులత, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, మార్లపూడి సుబ్బారావు, చల్లా కుమారస్వామి, మారంపూడి ఏసుదాసు, దాట్ల రామలింగరాజు, కునుకు పుల్లయ్య పాల్గొన్నారు. ప్రత్తిపాడులో వీర్ల గోవింద్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎస్సీ పేటలో కేక్ కట్ చేశారు. పెంటపాడులో కోనేరు చెరువు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, మార్కెట్ యార్డు మాజీ సభ్యులు కర్రి వరహాల రెడ్డి, బస్సుల రెడ్డి, నల్లమిల్లి అప్పిరెడ్డి, ఎంపీటీసీ పొట్ల ఏడుకొండలు, బండారు రాంబాబు, జై రాంబాబు పాల్గొన్నారు. పరిమెళ్లలో సర్పంచ్ గొర్రెల కోటేష్ కొండేపాడులో మాజీ ఎంపీటీసీ పాలా గణపతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. 50 కేజీల కేక్ కట్ చేసి పేదలకు పంచారు. దేవరశెట్టి రాంబాబు, మద్రే కృష్ణమూర్తి, వద్రే రామకృష్ణ, పబ్బా రామారావు గూడూరి సూర్యనారాయణ పాల్గొన్నారు. రామచంద్రపురంలోని వేడుకల్లో చల్లా లింగమూర్తి, కుమారస్వామి, ఎస్సీ సంఘ నాయకులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం రూరల్: మారంపల్లిలో కేక్ కట్ చేస్తున్న వడ్డి రఘురాం నాయుడు, వైఎస్సార్ సీపీ శ్రేణులు


పెంటపాడు: ప్రభుత్వ బేసిక్‌స్కూలు వద్ద పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనుబంధ విభాగాల నాయకులకు అభినందనలు

అత్తిలి: వైఎస్సార్ సీపీ దివ్యాంగ విభాగం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బుడితి సుజన్‌కుమార్‌ను శనివారం ఆ పార్టీ నాయకులు పూలమాలలుతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని, అధికారమే లక్ష్యంగా అందరూ కష్టపడి పనిచేసి మరోసారి ప్రజా సంక్షేమపాలన అందించేందుకు కృషి చేయాలని కోరారు. దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకి, పార్టీ నాయకులందరికీ సుజన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు తదితరులు సుజన్‌కుమార్‌ను అభినందించారు.

తణుకులో..

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాలకు నియమించిన నాయకులను శనివారం ఆ పార్టీ శ్రేణులు తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అభినందించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, వైఎస్సార్ సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, పంచాయతీ రాజ్ వింగ్ జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి బాల లక్ష్మీనారాయణ (బాలాజీ), దివ్యాంగుల విభాగ జిల్లా అధ్యక్షుడు బుడితి సుజన్‌కుమార్‌లను తణుకు నియోజకవర్గ పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు మండల అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, పార్టీ నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు నత్తా కృష్ణవేణి, ఉండవల్లి జానకి పాల్గొన్నారు.


అత్తిలి: దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడు బుడితి సుజన్‌కుమార్‌ను అభినందిస్తున్న పార్టీ శ్రేణులు


తణుకు అర్బన్: సురేష్, జగదీష్‌లను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో మాల సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు, జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్‌ను అమిత్ షా విమర్శిస్తే కృష్ణ మాదిగ ఎందుకు మాట్లాడటం లేదని విమర్శించారు. తొలుత ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అలరించిన క్రిస్మస్ వేడుకలు


ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో శనివారం యూత్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రతి మతాన్ని గౌరవించాలని, భగవద్గీత, బైబిల్, ఖురాన్ ఏదైనా మనుషుల్లో ప్రేమ, శాంతిని పెంపొందిస్తాయని స్పష్టం చేశారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ ఎస్.బాలరాజు క్రిస్మస్ కేకు కట్‌చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, వీజీఎస్‌స్కూలు సెక్రటరీ చిట్టూరి రీనాసాయి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీహెచ్ హిమబిందు, కన్వీనర్ జి.అరుణకుమారి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నమూనాలు

తణుకు అర్బన్: మ్యాథ్స్ డే సందర్భంగా విద్యార్థులు రూపొందించిన గణిత శాస్త్ర నమూనాలు ఆలోచింపచేస్తున్నాయని మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అన్నారు. తణుకు మాంటిస్సోరీ స్కూలులో శనివారం నిర్వహించిన మ్యాథ్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గణితంలో చూపించే ప్రతిభ భవిష్యత్‌ను బంగారుబాటగా మారుస్తుందని అన్నారు. అనంతరం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన ధ్యాన ప్రదర్శనను తిలకించారు.

జాబ్‌మేళాలో 38 మంది ఎంపిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీవాసవి జీఎంఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 98 మంది పాల్గొనగా 38 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, భారత్ ఫైనాన్సియల్ లిమిటెడ్ ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. అభ్యర్థులను ప్రిన్సిపాల్ వీఎస్‌ఎన్ శ్రీనివాస్, సెక్రటరీ లక్ష్మీనారాయణ అభినందించారు.

నేడు దివ్యాంగుల సభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ మాసోత్సవ సభను తాడేపల్లిగూడెం దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీవీఆర్ కళాకేంద్రం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు, సంఘ నిర్వాహకులు తెలిపారు.

వంద రోజుల ప్రణాళిక అమలు చేయాలి


రామన్నగూడెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో నారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని వంద రోజుల ప్రణాళిక ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ సూచించారు. మండలంలోని రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో నారాయణ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారికి పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల పట్ల భయాన్ని వీడి మానసికంగా ధృఢంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనం తయారీ విధానం, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో వి.హనుమ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, సీఆర్‌పీ బత్తుల నానిబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గంజాయి, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

తణుకు అర్బన్: యువత ఫ్యాషన్‌గా మొదలుపెట్టే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వారిని బానిసలుగా మారుస్తాయని తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠరెడ్డి అన్నారు. తణుకు ఆర్టీసీ బస్సు డిపో ప్రాంతంలో శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలు సేవించడం వలన ఆ మత్తులో తెలియకుండానే నేరాలు చేసే పరిస్థితులు తలెత్తుతున్నాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల నిరోధానికి స్థానికులు, ప్రయాణికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ ఎస్.అప్పలస్వామి, శ్రీమన్నారాయణ, కానిస్టేబుల్ జి.గంగాధర్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్: రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం పెదతాడేపల్లి సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను అధికారులు సత్వరమే పూర్తిచేయాలని, వారిని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సదస్సులో గ్రామ పరిధిలోని మేకల సంత వల్ల భవిష్యత్‌లో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, దాన్ని తొలగించాలని బీజేపీ నాయకుడు బండి శ్రీనివాస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కోరారు. దీనిపై సర్పంచ్ పోతుల అన్నవరం స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ పథకంలో పొందిన డ్రోన్‌ను ఏం చేశారంటూ బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌ను ప్రశ్నించగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగింది. దీంతో ఎమ్మెల్యే బొలిశెట్టి కలుగజేసుకుని వారిరువురిని శాంతింపజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.వెంకటేష్, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, వీఆర్వో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, మాజీ సర్పంచ్ ముత్యాల సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

అత్తిలి: ఈడూరులో శ్రీవరాల వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు జరిపారు. అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని తులసిమాలలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు.